క్లుప్తంగా

ఆర్థిక సాయం


బాధితుడికి ఆర్థిక సాయం అందజేస్తున్న సంఘ ప్రతినిధులు

చీపురుపల్లిరూరల్(గరివిడి): గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న గరివిడికి చెందిన దొడ్డి వెంకటరమణకు పద్మశాలి సంఘం సభ్యులు ఆర్థిక సాయం చేశారు. పశ్చిమ గోదావరి జిల్లా సంఘ యువజన విభాగం అధ్యక్షుడు సప్పా మణికంఠ, ఆకివీడు పద్మశాలి సంఘం సమకూర్చిన రూ.16వేలను గరివిడి సంఘ ప్రతినిధుల చేతుల మీదుగా బాధితుడికి ఆదివారం అందజేశారు.

మందిరవలస విద్యార్థుల ప్రతిభ


ఉపకార వేతనం అందుకుంటున్న విద్యార్థులు

చీపురుపల్లిరూరల్(గరివిడి): గరివిడి మండలంలోని మందిరవలస ప్రాథమిక పాఠశాల విద్యార్థులు శోధన సంస్థ నిర్వహించిన ఉపకార వేతన పోటీ పరీక్షల్లో ప్రతిభ చూపారు. మూడు మండలాల స్థాయిలో నిర్వహించిన పరీక్షలో జి.హేమంత్, వై.జ్వాల ప్రథమ, తృతీయ స్థానాలు సాధించారు. సంస్థ వ్యవస్థాపకుడు పి.డి.కామేశ్వరరావు చేతుల మీదుగా స్కాలర్‌షిప్ అందుకున్నారు.

చిన్నారుల సమయ స్ఫూర్తికి చిరు సత్కారం


విద్యార్థినులను సన్మానిస్తున్న ఓంశాంతి భవనం ఇన్‌చార్జ్ లత

చీపురుపల్లి రూరల్(గరివిడి): ఓ వృద్ధుడిని విషసర్పం నుంచి సమయస్ఫూర్తితో కాపాడిన ఇద్దరు చిన్నారులను గరివిడిలో ఆదివారం ప్రజాపిత బ్రహ్మకుమారీస్ భవనంలో సత్కరించారు. ఇటీవల కోడూరు పాఠశాలకు చెందిన ఐదో తరగతి విద్యార్థినులు జి.దేదిప్య, జి.చరిష్మా ఇంటికి వెళ్తున్న సమయంలో కంటి చూపులేని ఓ వృద్ధుడి ముందు విషసర్పం ఉండటాన్ని గమనించి సమయస్ఫూర్తితో వ్యవహరించి కాపాడారు. విద్యార్థుల ధైర్య సాహసాన్ని మెచ్చుకుని ఓం శాంతి భవనంలో లత ఇద్దరినీ సన్మానించారు. పిల్లల సాహసాన్ని మెచ్చుకుని అభినందించారు.

త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం


అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న దళితనేతలు

జామి: త్రైతసిద్ధాంత ప్రబోధ సేవా సమితి, ఇందూ జ్ఞానవేదిక సభ్యులు మండల కేంద్రంలో త్రైత సిద్ధాంత భగవద్గీతపై ఆదివారం ప్రచారం చేశారు. ప్రబోధ సేవా సమితి, ఇందూ జ్ఞానవేదిక విజయగనరం కమిటీ అధ్యక్షుడు వానపల్లి శంకరరావు మాట్లాడుతూ జీవాత్మ, ఆత్మ, పరమాత్మల విషయాన్ని శాస్త్రీయంగా తెలుసుకోవడానికి భగవంతుడు అందించిన ఏకైక మార్గం భగవద్గీత అని అన్నారు. కర్మయోగం విశిష్టత గురించి వివరించారు. ప్రబోధసేవాసమితి సభ్యులు సి.వి.ఎస్.నాయుడు, ప్రసాద్, కోటి, రాజేష్, భానుమతి, కృష్ణవేణి, తదితరులు పాల్గొన్నారు.

డోలు వాయిద్యంలో కాంస్య పతకం


నిర్వాహకుల నుంచి అవార్డు అందుకుంటున్న భాస్కరరావు

శృంగవరపుకోట: మండలంలోని సంతగవిరమ్మపేట గ్రామానికి చెందిన డోలు వాయిద్యకారుడు తీడ భాస్కరరావు డోలు వాయిద్యంలో రాష్ట్రస్థాయిలో కాంస్య పతకం సాధించాడు. శ్రీ వాగ్దేవి వాయిద్య సంగీత కళా నృత్య సంస్కృతి సమితి ఆధ్వర్యంలో ఆదివారం విజయవాడలో నిర్వహించిన స్వరసప్త సంగీత వాయిద్య నృత్య సమ్మేళనంలో పోటీ పడి, కాంస్యపతకం సాధించినట్టు భాస్కరరావు చెప్పారు. సంగీత కళా విద్వాంసులు జి.చంద్రశేఖర్, ప్రోగ్రామ్ ఆర్గనైజర్ బి.నాగేంద్ర యాదవ్ చేతుల మీదుగా బహుమతి అందుకున్నట్టు ఆయన తెలిపారు.

అక్టోబర్ 5న 'భోజన' కార్మికుల జిల్లా మహాసభలు

విజయనగరం గంటస్తంభం: జిల్లా మధ్యాహ్న భోజన పథకం నాల్గో మహాసభలు అక్టోబర్ 5న స్థానిక అమర్ భవన్‌లో జరగనున్నాయని విజయవంతం చేయాలని ఆ సంఘం (ఏఐటీయూసీ) జిల్లా అధ్యక్షుడు ఎం.మురళీధరరావు పిలుపునిచ్చారు.

యూరియా పంపిణీలో కూటమి విఫలం

- జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు
- మండల సమావేశంలో యూరియా పంపిణీపై ధ్వజమెత్తిన సభ్యులు
- మెరకముడిదాం మండలంలో యూరియా పంపిణీపై విజిలెన్స్ అధికారులతో సమగ్ర విచారణ జరపాలని సభ్యుల తీర్మానం
- తీర్మానాన్ని కలెక్టర్‌కు అందజేయాలని ఇన్‌చార్జి ఎంపీడీవోకు సూచించిన జెడ్పీ చైర్మన్
- ఉపాధి వేతనంపై నిలదీసిన జెడ్పీ చైర్మన్


సమావేశంలో వ్యవసాయ శాఖ అధికారిణి శ్రావణితేజను నిలదీస్తున్న జెడ్పీ చైర్మన్, ఎంపీటీసీ సభ్యులు

మెరకముడిదాం:

రైతులకు యూరియా పంపిణీ చేయడంలో ప్రభుత్వం, వ్యవసాయ శాఖాధికారులు పూర్తిగా విఫలమయ్యారని జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం ఆదివారం ఎంపీపీ తాడ్డి కృష్ణవేణి అధ్యక్షతన జరిగింది. సమావేశంలో జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు పాల్గొన్నారు. సమావేశంలో ముందుగా వ్యవసాయ శాఖాధికారిణి శ్రావణితేజ మాట్లాడుతూ ఇంత వరకూ మండలంలో 691 టన్నుల యూరియాను పంపిణీ చేశామని తెలిపారు. దీనికి సోమలింగాపురం ఎంపీటీసీ ఎస్.సీతారామరాజు, బిక్షలవలస సర్పంచ్ వర్మరాజు, నరసయ్యపేట సర్పంచ్ పెనుమజ్జి అప్పలనారాయణ, మెరకముడిదాం ఎంపీటీసీ గోపి అడ్డుతగిలి యూరియా పంపిణీ పూర్తిగా తెలుగుదేశం పార్టీకి చెందిన నాయకులు కనుసన్నలలోనే జరిగిందని, దీనికి అధికారులు పూర్తిగా సహకరించారని మండిపడ్డారు. మెరకముడిదాం ఆర్‌ఎస్‌కేకు వచ్చిన లోడు యూరియాను గర్భాంలో ఒక టీడీపీ నాయకుడు ఇంటికి తరలించి అక్కడ ఒక్కో యూరియా బస్తా 500 రూపాయలు చొప్పున అమ్మకాలు జరిపారని సభ్యులు ఆరోపించారు. దీనికి స్పందించిన జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు జాయింట్ కలెక్టర్ సేతుమాధవన్‌కు ఫోన్ చేసి మెరకముడిదాం ఆర్‌ఎస్‌కేకు వచ్చిన లోడు యూరియాను గర్భాం ఎలా తరలించారన్న విషయంపై దర్యాప్తు చేయాలని కోరారు. ఇంతలో అక్కడే వున్న వైస్ ఎంపీపీ టి.హరిబాబు ఉత్తరావల్లి గ్రామానికి సంబంధించి నాలుగు యూరియా లోడ్లు పంపిణీ చేసినట్టు అధికారులు తమ రికార్డుల్లో చూపించారని, అయితే వాస్తవానికి రెండు లోడ్లు యూరియా మాత్రమే పంపిణీ చేశారని తెలిపారు. అనంతరం ఉపాధి హామీ పనులకు సంబంధించి వివరాలను ఇంజినీరింగ్ అసిస్టెంట్ నరేంద్రకుమార్ వెల్లడిస్తుండగా జెడ్పీ చైర్మన్ శ్రీనివాసరావు కల్పించుకుని 13 వారాలు ఉపాధి పనులను చేసిన వేతనదారులకు వేతనాలను ఎందుకు చెల్లించలేదని నిలదీశారు. దీనికి ఈసీ నరేంద్రకుమార్ స్పందిస్తూ ప్రభుత్వం నిధులు విడుదల చేయలేదని, విడుదల చేసిన వెంటనే వేతనాలను అందజేస్తామన్నారు. రెవెన్యూ సమస్యలకు సంబంధించి తహసీల్దారు సులోచనా రాణి వివరిస్తుండగా సభ్యులు కొందరు స్పందిస్తూ రీసర్వే జరిగిన గ్రామాల్లో భూములకు చెందిన ఒన్‌బీలు ఆన్‌లైన్‌లో రావడం లేదని, అలాగే రిజిస్ట్రేషన్‌లు కూడా కావడం లేదని తెలిపారు. దీనికి తహసీల్దారు సులోచనారాణి స్పందిస్తూ ఈ సమస్యను ప్రభుత్వం పరిష్కరిస్తే తప్ప తమ పరిధిలో ఏమీ లేదని తెలిపారు. సమావేశంలో ఇన్‌చార్జి ఎంపీడీవో సుధాకర్‌పట్నాయక్, వైస్ ఎంపీపీ తలచుట్ల హరిబాబు, పలువురు అధికారులు, పలువురు ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

నరికివేసిన మామిడి తోట పరిశీలన


నరికివేసిన చెట్లను పరిశీలిస్తున్న ఎస్‌ఐ మహేష్, ఎంపీపీ చలంనాయుడు

బొండపల్లి: మండలంలోని దేవుపల్లి గ్రామ రెవెన్యూ పరిధి కొండవానిపాలెం గ్రామానికి ఆనుకుని ఉన్న మామిడితోటలో నరికి వేసిన చెట్లను ఎస్‌ఐ యు.మహేష్ ఆదివారం పరిశీలించారు. సర్వే నెంబరు 322/6లో ఉన్న పది ఎకరాల జిరాయితీ భూమిలో 30 సంవత్సరాలుగా మామిడి సాగు చేస్తున్నామని, దేవుపల్లి గ్రామానికి చెందిన వెన్నెల రామునాయుడు, ఇట్లా తిరుపతిరావు, విశాఖపట్నానికి చెందిన పైల నటరాజు అక్రమంగా తమ తోటలోని చెట్లను నరికివేశారని బాధిత రైతులు ముదునూరు సన్యాసి రాజు, చేకూరి సూర్యకుమారి పోలీస్ స్టేషన్‌లో శనివారం ఫిర్యాదు చేశారు. దీంతో ఎస్‌ఐ మామిడి తోటను పరిశీలించారు. ఈ పరిశీలనలో పాల్గొన్న ఎంపీపీ చల్లా చలంనాయుడు మాట్లాడుతూ బాధ్యులపై చర్యలు తీసుకోవాలని, బాధిత రైతులకు న్యాయం చేయాలని పోలీసులను కోరారు. ఏఎస్‌ఐ ఎల్.గోపి పాల్గొన్నారు.

జిందాల్ కర్మాగారాన్ని తక్షణమే తెరవాలి

కొత్తవలస: మండలంలోని అప్పన్నపాలెం గ్రామ సమీపంలో ఉన్న జిందాల్ స్టెయిన్‌లెస్ స్టీల్ కర్మాగారాన్ని తక్షణమే తెరిచి, కార్మికులకు ఉపాధి కల్పించాలని టీఎన్‌టీయూసీ గౌరవ అధ్యక్షుడు లెంక శ్రీను డిమాండ్ చేశారు. కర్మాగారం మెయిన్ గేటు వద్ద కార్మికులతో ఆదివారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కర్మాగారం మూతబడి ఆరు నెలలు గడుస్తోందని, కార్మికుల కుటుంబాలు రోడ్డున పడ్డాయని ఆవేదన వ్యక్తం చేశారు.కర్మాగారం యాజమాన్యంతో విశాఖపట్నంలో ఈ నెల 26న చర్చలు జరగనున్నాయని, యాజమాన్యం సానుకూలంగా వ్యవహరించి కర్మాగారం తెరిచేందుకు కృషి చేస్తుందని ఆశిస్తున్నామని తెలిపారు. కర్మాగారం తెరవకుంటే ప్రతీ కార్మికుడికి రూ.40 లక్షల పరిహారం అందజేయాలని కోరారు. యూనియన్ నాయకులు బొబ్బర అప్పారావు, సలాది భీమయ్య, పిల్లా సీతారామ్, సన్యాసి, దేముడుబాబు, రమణ, రామలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి శరన్నవరాత్రి ఉత్సవాలు

బొండపల్లి: దేవుపల్లిలోని రాజరాజేశ్వరిదేవి అమ్మవారి ఆలయంలో సోమవారం నుంచి వచ్చే నెల 2వ తేదీ వరకు దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు నిర్వహించనున్నట్టు అర్చకులు దూసి శ్రీధర్‌శర్మ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. తొమ్మిది రోజుల పాటు అమ్మవారు రోజుకో అవతారంలో భక్తులకు దర్శనమివ్వనున్నారని పేర్కొన్నారు. ఉత్సవాలను విజయవంతం చేయాలని కోరారు.

సృష్టికి మూలకర్త విశ్వకర్మ


జిల్లా అధ్యక్షుడు ఆచారిని సత్కరిస్తున్న చీపురుపల్లి మండల విశ్వబ్రాహ్మణ సంఘం ప్రతినిధులు

చీపురుపల్లి: సృష్టికి మూలకర్త విశ్వకర్మ అని విశ్వబ్రాహ్మణ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు కిల్లంపల్లి ఆచారి పేర్కొన్నారు. చీపురుపల్లిలోని శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో మూడు రోజులుగా జరుగుతున్న విశ్వకర్మ జయంతి ఉత్సవాల్లో ఆయన ఆదివారం పాల్గొన్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రుగ్వేదం, యజుర్వేదంలో విశ్వకర్మ సృష్టికర్తగా, అదర్వణ వేదంలో ఆహార ప్రదాతగా విశ్వకర్మ అభివర్ణించబడ్డారని చెప్పారు. విశ్వాసానికి దైవిక వాస్తు శిల్పిగా, కళాత్మకత, నైపుణ్యం, సృజనాత్మకతకు ప్రతిరూపంగా విశ్వకర్మను భావించడం జరుగుతోందన్నారు. విశ్వకర్మ జయంత్యుత్సవాలు ప్రపంచ వ్యాప్తంగా వైభవంగా నిర్వహించుకోవడం గొప్ప విషయమన్నారు. కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ సంక్షేమ సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కొండపల్లి అప్పారావు, విజయనగరం పట్టణ నాయకుడు ఏడాకుల గోవిందరావు, జిల్లా ఉపాధ్యక్షుడు లక్కోజు సత్యనారాయణ, జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు లోచర్ల రామకృష్ణ, స్థానిక విశ్వబ్రాహ్మణ సంఘ నాయకులు పట్నాన ఈశ్వరరావు, సర్వసిద్ధి భాస్కరరావు, లంకలపల్లి కనకరాజు, తదితరులు పాల్గొన్నారు.

ఐక్య పోరాటాలతో హక్కులు సాధించుకుందాం


అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న దళితనేతలు

వేపాడ: దళితులు ఐక్యతతో పోరాటం చేస్తే రాజ్యాంగం కల్పించిన హక్కులు సాధించుకోవచ్చని దళిత ఉద్యమనేత ఆతవ ఉదయ్ భాస్కర్ అన్నారు. దళిత విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో అరిగిపాలెం, రామస్వామిపేట, సీతారాంపురం గ్రామాల్లో ఆదివారం ఆత్మీయ సమావేశాలు నిర్వహించారు. ముందుగా ఆయా గ్రామాల్లో అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్య, విజ్ఞానం, ఉపాధి రంగాల్లో ముందుకు సాగాలంటే ఐక్యతతో పోరాడాల్సి ఉందన్నారు. అట్రాసిటీ చట్టంలో స్టేషన్ బెయిల్ రద్దుచేయాలని, సబ్ ప్లాన్ నిధులు విడుదల చేయాలని, ఎస్సీ కార్పొరేషన్ రుణాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. దళిత నేతలు దోల కేశవ, గుగ్రపు శ్రీను,ఈశ్వరరావు, శివరామకృష్ణ, శిల్ల కృష్ణ, అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

గురజాడకు ఘన నివాళి


గురజాడ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న పట్టణ ప్రముఖులు, స్థానికులు

శృంగవరపుకోట: సంఘ సంస్కర్త, సాహితీకారుడు, అభ్యుదయ కవి గురజాడ అప్పారావు జయంతిని స్థానిక శాఖా గ్రంథాలయంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. గురుజాడ చిత్రపటం వద్ద స్థానిక వైద్యురాలు పి.వరలక్ష్మి, ఓటరు అక్షరాస్యత వేదిక అధ్యక్షుడు డి.సూర్యారావు, లైబ్రేరియన్ డి.శీధర్, పాఠకులు నివాళులర్పించారు. కార్యక్రమంలో పట్టణ యువత పాల్గొన్నారు.

కుంగిపోయిన రోడ్డు



గుర్ల మండలంలోని సోలిపిసోమరాజు పేట నుంచి వలాపురం వెళ్లే ప్రధాన రోడ్డు సాలిపిసోమరాజు పేట వద్ద కుంగిపోయింది. బస్సులు, ఆటోల రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో వల్లాపురం, దమరసింగి, బెల్లానపేట, మన్యపురిపేట గ్రామాల నుంచి చదువుకునేందుకు, వివిధ పనులపై జిల్లా కేంద్రానికి వెళ్లేవారికి ఇబ్బందులు తప్పడం లేదు. రాత్రి సమయంలో ద్విచక్ర వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. అధికారులు స్పందించి తక్షణమే రోడ్డు మరమ్మతులు చేయాలని విద్యార్థులు, వాహనదారులు కోరుతున్నారు. – గుర్ల

24న చలో విశాఖ డెయిరీ


జామి: జామిలో చలో విశాఖ డెయిరీ వాల్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న రాంబాబు, తదితరులు

గంట్యాడ/జామి: విశాఖ డెయిరీలో జరిగిన అవినీతిపై వేసిన హౌస్ కమిటీ విచారణ త్వరగా పూర్తి చేసి దోషులను శిక్షించాలని, డెయిరీ ఆస్తులను కాపాడాలని ఆంధ్రప్ర దేశ్ పాలరైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బి.రాంబాబు డిమాండ్ చేశారు.ఈనెల 24వ తేదీన చేపట్టనున్న చలో విశాఖ డెయిరీ కార్యక్రమానికి సంబంధించిన వాల్ పోస్టర్లను గంట్యాడ మండలంలోని బుడతానపల్లి గ్రామంలో, జామి మండల కేంద్రంలో పాల రైతుల సంఘం సభ్యులతో కలిసి ఆదివారం ఆవిష్కరించారు. ఈసంద ర్భంగా ఆయన మాట్లాడుతూ పాల సేకరణ ధర లీటరుకు రూ.10 పెంచాలని, మూడు నెలలకు ఒకసారి బోనస్ ఇవ్వాలని, చనిపోయిన పాడి రైతు కుటుంబానికి పరిహారం అందించాలని కోరారు.అలాగే పశువులకు ఉచిత బీమా కల్పించాలని, 75 శాతం రాయితీపై మందులు,దాణా ఇవ్వాలన్నారు. విశాఖ డెయిరీ పాలరైతులది అని, అవినీతిపరుల నుంచి కాపాడుకుందామని అన్నారు. చలో విశాఖ డెయిరీ కార్యక్రమంలో భాగంగా 24వ తేదీన ఉదయం 10 గంటలకు గాజువాకలో నిర్వహించనున్న జనరల్ బాడీ సమావేశానికి పాడి రైతులు పెద్ద ఎత్తున తరలి వచ్చి విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు. పాలరైతుల సంఘం జిల్లా అధ్యక్షుడు లోకరవపు ఆదినారాయణమూర్తి, సంఘం నాయకులు సునీల్, చలుమూరి వెంకటరావు, సిరికి వెంకట సత్యన్నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

కొత్తవలస: చలో విశాఖ డెయిరీ కార్యక్రమానికి సంబంధించిన వాల్‌పోస్టర్లను మండలంలోని నిమ్మలపాలెం గ్రామ పాలకేంద్రం వద్ద జిల్లా రైతు సంఘం కార్యదర్శి గొంప కృష్ణమూర్తి ఆధ్వర్యంలో ఆదివారం ఆవిష్కరించారు.వ్యవసాయ కార్మిక సంఘం నాయకుడు గాడి అప్పారావు పాల్గొన్నారు.


కొత్తవలస: నిమ్మలపాలెంలో చలో విశాఖ డెయిరీ వాల్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కృష్ణమూర్తి, తదితరులు

యువకుడికి మాజీ ఎంపీ బెల్లాన అభినందన


ధనుంజయకు మిఠాయి తినిపిస్తున్న మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్

చీపురుపల్లి: పేదరికంలో జన్మించాడు, పారిశుధ్య విధులు నిర్వహిస్తూ తన తల్లి ఎంతో కష్టపడి చదివించిన విషయాలు గుర్తుంచుకున్నాడు. ఎలాగైనా ప్రభుత్వ ఉద్యోగం సాధించి తన తల్లిని సుఖ పెట్టాలని నిర్ణయించుకున్నాడు. అంతే ఇటీవల విడుదలైన డీఎస్సీ ఫలితాల్లో వ్యాయామ ఉపాధ్యాయుని ఉద్యోగం సాధించి తనతో బాటు తన తల్లి కలలను నిజం చేసుకున్నాడు పట్టణంలోని డైలీ మార్కెట్‌కు చెందిన పెద్దింటి ధనుంజయ. పేదింటిలో జన్మించినప్పటికీ ఎంతో కష్టపడి చదువుకుని ఉపాధ్యాయ ఉద్యోగం సాధించిన ధనుంజయను ఆదివారం మాజీ ఎంపీ, పీఏసీ మెంబర్ బెల్లాన చంద్రశేఖర్ మిఠాయి తినిపించి అభినందించారు. భవిష్యత్‌లో మరింత ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. పట్టణంలోని డైలీ మార్కెట్‌కు చెందిన పెద్దింటి ధనుంజయ ఇటీవల విడుదలైన డీఎస్సీ ఫలితాల్లో జిల్లా స్థాయిలో 58వ ర్యాంక్ సాధించాడు. దీంతో వ్యాయామ ఉపాధ్యాయునిగా ఉద్యోగం సాధించాడు. అయితే ధనుంజయ తల్లి మంగమ్మ చీపురుపల్లి మేజర్ పంచాయతీలో పారిశుధ్య కార్మికురాలుగా విధులు నిర్వహిస్తోంది.

టార్గెట్‌బాల్ పోటీల్లో సత్తా


టార్గెట్‌బాల్ పోటీల్లో రాణించిన విద్యార్థులు

శృంగవరపుకోట: మండలంలోని భవానీనగర్ వద్ద ఉన్న డీవీఎల్ స్కూల్ విద్యార్థులు టార్గెట్ బాల్ పోటీల్లో సత్తాచాటారని ఆ పాఠశాల ప్రిన్సిపాల్ వై.జానకీదేవి ఆదివారం తెలిపారు. ఇటీవల విశాఖలో జరిగిన టార్గెట్‌బాల్ టోర్నమెంట్‌లో విశాఖ తరపున సబ్‌జూనియర్స్ బాలికల విభాగంలో ఎం.షారోన్‌సైనీ, బి.అనూరాధ తృతీయ స్థానం సాధించారు. సబ్ జూనియర్స్ బాలుర విభాగంలో డి.హర్షవర్ధన్, కె.దేవీప్రసాద్ ద్వితీయ స్థానం సాధించారు. విద్యార్థులను, శిక్షణ ఇచ్చిన కోచ్ జి.రామును పాఠశాల యాజమాన్యం డాక్టర్ వరలక్ష్మి, రాజేంద్రప్రసాద్, ఉపాధ్యాయ సిబ్బంది అభినందించారు.

నేటి నుంచి ఎంపీపీ, సర్పంచ్‌లకు శిక్షణ

చీపురుపల్లి: నియోజవకర్గంలోని చీపురుపల్లి, గరివిడి, గుర్ల, మెరకముడిదాం మండలాలకు చెందిన ఎంపీపీలు, అన్ని పంచాయతీల సర్పంచ్‌లకు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో రెండు రోజుల పాటు శిక్షణ ఇస్తామని ఎంపీడీఓ ఐ.సురేష్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్‌జీఎస్‌ఏ కార్యాచరణ ప్రణాళిక 2025–26 సంవత్సరానికి సంబంధించి శిక్షణ ఉంటుందని తెలిపారు. ఈ నెల 22, 23 తేదీల్లో చీపురుపల్లి, గుర్ల మండలాలకు, 24, 25 తేదీల్లో గరివిడి, మెరకముడిదాం మండలాల ప్రజాప్రతినిధులకు శిక్షణ ఉంటుందని పేర్కొన్నారు.

కుర్చీకోసం సిగపట్లు.. దేవుళ్లకు అగచాట్లు

- దేవస్థానాల ట్రస్టుబోర్డుల నియామకాలపై టీడీపీలో వర్గ విభేదాలు
- ఏడాదిగా కాలయాపన
- ఆలయాలపై పర్యవేక్షణ కరువు



శృంగవరపుకోట: అగ్గిపుల్ల, సబ్బుబిళ్ల, కుక్క పిల్ల కాదేదీ కవితకు అనర్హమని కవి శ్రీశ్రీ చెప్పినట్టు.. ఎస్.కోట టీడీపీ నేతలకు రాజకీయాలకు కాదేదీ అనర్హమని అన్నట్టు ఉంది పరిస్థితి. తమ ఆధిపత్యం చూపించడానికి దేవుళ్లను కూడా వదలడం లేదు. ఎస్.కోటలో దేవస్థానాలకు ట్రస్టుబోర్డుల నియామకాల్లో నియోజకవర్గ టీడీపీ పెద్దలు తమ ఆధిపత్యం కోసం సిగపట్లు పట్టడంతో ఏడాదిన్నర కాలంగా దేవస్థానాల అభివృద్ధి అటకెక్కింది. ఆధిపత్యం కోసం దేవాలయాలు, దేవుళ్లతో ఈ రాజకీయం ఏంటని, ప్రజలు ఈసడించుకుంటున్నారు.

చైర్మన్‌గిరి కోసం వర్గపోరు

ఉత్తరాంధ్రలో వాసికెక్కిన శైవక్షేత్రం పుణ్యగిరి దేవస్థానం ట్రస్టుబోర్డు చైర్మన్ పదవీకాలం 2024జూన్‌లో ముగిసింది. సన్యాసేశ్వర స్వామి దేవస్థానం చైర్మన్ పదవీ కాలం కూడా ఆ సమయంలోనే ముగిసింది. ఆయా దేవస్థానాల ట్రస్టు బోర్డుల చైర్మన్ పదవులు తమ వర్గీయులకే కట్టబెట్టాలని, తమ ఆధిపత్యం నిలబెట్టుకోవాలని ఎమ్మెల్యే లలిత కుమారి,డీసీఎంఎస్ చైర్మన్ గొంప కృష్ణ భీష్మించుకు కూర్చున్నారు.పుణ్యగిరి దేవస్థానం చైర్మన్‌గా ఎమ్మెల్యే లలితకుమారి తన అనుచరులైన పెదగాడి రాజును, సన్యాసే శ్వరస్వామి దేవస్థానం చైర్మన్‌గా గిడుతూరి కొండబాబు పేర్లు సిఫార్సు చేయగా, డీసీఎంఎస్ చైర్మన్ గొంప కృష్ణ తన అనుచరులు ఆర్.సాయిరాం, కొమ్మోజు సత్యనారాయణ పేర్లను సిఫార్సు చేశారు. వీళ్లిద్దరూ తాము సిఫార్సు చేసిన వారికే పదవులు ఇవ్వాలని పట్టుబట్టడంతో దేవదాయశాఖ అధికారులకు ఏం చేయాలో తెలియక ఫైళ్లు ముట్టుకోకుండా పక్కన పెట్టారు. మరోవైపు విశాఖపట్నం ఎంపీ కూడా తనకు చెప్పే పుణ్యగిరి దేవస్థానం చైర్మన్ నియామకం చేయాలని అధికారులకు అల్టిమేటం చేయడంతో ఈ పదవుల నియామకానికి బ్రేక్ పడింది.

పడకేసిన దేవాలయాల ప్రగతి

నేతల సిగపట్లుతో దేవాలయాల ప్రగతి పడకేసింది. ట్రస్టుబోర్డులు ఏర్పాటు కాక, అభివృద్ధి మరమ్మతుల పనులు ఏమీ జరగడం లేదు. టీడీపీలోవర్గ విభేదాలతో దేవాలయాల అభివృద్ధికి గ్రహణం పట్టింది.ఆలయాలపై పర్యవేక్షణ కరువయ్యింది. దేవాలయా లు అభివృద్ధి చేయాలి, భక్తుల మనోభీష్టాలు నెరవేర్చాలన్న తలంపు అధికార టీడీపీ కూటమి పెద్దల్లో కరువయ్యింది. ట్రస్టుబోర్డులు లేక దేవాలయాలపై దేవదాయశాఖ ఉద్యోగులు గుత్తాధిపత్యం ప్రదర్శిస్తున్నారు. భక్తులకు సౌకర్యాలు, సేవలు సన్నగిల్లాయి.

ఘనంగా మరిడమ్మ పండగ

శృంగవరపుకోట: మండలంలోని సీతారాంపురంలో గ్రామ దేవత మరిడమ్మ పండగను సర్పంచ్ మిడతాన చిన్నంనాయుడు, గ్రామపెద్దల నేతృత్వంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. గ్రామపెద్దలు, అనువంశిక పూజారుల నేతృత్వంలో అమ్మవారిని గద్దె ఇంటి నుంచి ప్రభలతో, భాజాభజంత్రీలు, డప్పులు, వాయిద్యాలు, సన్నాయిమేళాలతో ఊరేగింపుగా సాగి అమ్మవారి ఆలయానికి తీసుకొచ్చారు. గ్రామానికి చెందిన మహిళలు అమ్మవారికి పసుపు, కుంకుమ, చీర,రవికెలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. పండగ సందర్భంగా చిరతలు, కోలాటాలు, కోబ్రా,నేల డ్యాన్స్, తదితర సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.


ప్రభతో ఊరేగింపుగా అమ్మవారి ఆలయానికి వెళుతున్న గ్రామస్తులు